సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 12 । ఫిబ్రవరి । 2023



అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

వాహనాల టైర్లు, కాపర్ వైండింగ్ బాక్సులను దొంగలించడమే లక్ష్యంగా చేసుకున్న అంతర్ రాష్ట్ర దొంగను అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. -8లో..



రాజీ మార్గం.. సత్వర న్యాయం

రాజీ మార్గంలో సత్వర న్యాయం లభిస్తుందని సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి పి.భాస్కరరావు పేర్కొన్నారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.100	రూ.186

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 130 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	713	713
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 100.34 కిలోలు



న్యూస్‌రీల్

గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు



మరుగుదొడ్ల అధ్వాన్న స్థితిపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్పెషల్ ఆఫీసర్ సాంబశివయ్య

లక్కిరెడ్డిపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను స్పెషల్ ఆఫీసర్, హౌసింగ్ పీడీ సాంబశివయ్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధ్వానంగా ఉన్న బాత్‌రూమ్‌లు, లెట్రిన్ గదులు చూసి విస్తుపోయిన ఆయన అక్కడ పనిచేసే సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకులపాఠశాల అధ్వాన్న పరిస్థితులపై రాతపూర్వకంగా కలెక్టర్‌కు నివేదిస్తానని తెలిపారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సమస్యలపై విద్యార్థులు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ చక్రే నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గండిలో నిత్యాన్నదానానికి రూ.5లక్షల వితరణ



వీరాంజనేయ ప్రసాద్‌కు స్వామి చిత్ర పటాన్ని ఇస్తున్న అలవలపాటి ముకుందారెడ్డి

చక్రాయపేట(వైఎస్సార్ జిల్లా): గండి క్షేత్రంలో వెలసిన వీరాంజనేయ స్వామి సన్నిధిలో నిత్యం జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి తొగట వీర క్షత్రియ సంఘం అధ్యక్షుడు మోడెం వీరాంజనేయప్రసాద్ రు.5,00,116 విరాళంగా అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు.తన తల్లి అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం జెడ్పీటీసీ సభ్యురాలు జయమ్మ,తండ్రి కీర్తిశేషులు చిన్నప్పల జ్ఞాపకార్థం స్వామి వారి అన్నదానానికి విరాళంగా అందజేసినట్లు దాత తెలిపారు. దాత, ఆయన సమీప బంధువు రామచంద్రను ఆలయ సంప్రదాయం ప్రకారం సత్కరించారు. స్వామి వారి చిత్ర పటాన్ని బహూకరించారు ఆలయ చేర్మెన్ పినుపోలు రాఘవేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు లీగ్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్(వైఎస్సార్‌జిల్లా): క్రీడాకారుల్లోని ప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చేందుకు, వారి సామర్థ్యాలను అంచనా వేసేందుకు క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్‌ఆర్ డిస్ట్రిక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. భరత్‌రెడ్డి, అవ్వారు రెడ్డిప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని కేఎస్‌ఆర్ఎం, కేఓఆర్ఎం క్రీడామైదానాల్లో అండర్-12, అండర్-14 మిక్స్‌డ్ జట్లు,అండర్-16, అండర్-19 మిక్స్‌డ్ జట్లకు లీగ్ మ్యాచ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి శనివారం, ఆదివారం లీగ్ మ్యాచ్‌లు నిర్వహించనున్న ట్లు తెలిపారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని లీగ్ మ్యాచ్‌లను నిర్వహించారు.

- కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన అండర్-16, అండర్-19 మిక్స్‌డ్ టీం రెండురోజుల మ్యాచ్‌లో టీం-ఏ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 49.1 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన టీం-బి జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 28 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసి 13 పరుగుల ఆధిక్యంతో కొనసాగుతోంది.
- కేఎస్‌ఆర్ఎం మైదానంలో నిర్వహించిన అండర్-12, అండర్-14 మిక్స్‌డ్ టీం మ్యాచ్‌లో టీం-ఏ జట్టు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 60 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన టీం-బి జట్టు 53.3 ఓవర్లలో 124 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో టీం-ఏ జట్టు 68 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

రైళ్లన్నీ ఆగేదెన్నడు?

- రాజంపేటలో హాల్టింగ్స్‌పై రైల్వేశాఖ శీతకన్ను
- ఆర్వోబీ నుంచి స్టేషన్‌కు పాత్ లేని పరిస్థితి



పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలోని రైల్వేస్టేషన్

రాజంపేట: పార్లమెంటు నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట రైల్వేస్టేషన్ బీ క్లాస్ (నాన్ సబర్బన్ (ఎన్ఎస్‌జీ)-5 గా కొనసాగుతోంది. నెలకు రూ.12లక్షల ఆదాయం ఎర్నింగ్స్ ద్వారా వస్తోంది. బీ క్లాస్‌కు తగ్గట్టుగా సౌకర్యాలు కల్పించడంలో మాత్రం రైల్వే యాజమాన్యం విఫలమైంది. అలాగే ఇక్కడి నుంచి లోడింగ్ కూడా జరుగుతుంటోంది. రాజంపేట రైల్వే స్టేషన్‌లో కోవిడ్ తర్వాత కొన్ని రైళ్లు మాత్రమే ఆగుతున్నాయి. చాలా రైళ్లు ఆగకపోవడం గమనార్హం

రైళ్ల హాల్టింగ్ కొనసాగినప్పుడు..

రైళ్ల హాల్టింగ్ కొనసాగినప్పుడు లోడింగ్ వల్ల ఆదాయం బాగా ఉండేది. నిమ్మ, పలురకాల వస్తువులు ముంబై, చెన్నై, హైదరాబాదు, ఎర్నాకులానికి ఎగుమతులు జరుగేవి. నెలకు రూ.30లక్షల దాకా ఎర్నింగ్స్ రైల్వేకు వస్తోంది. రాజంపేట రైల్వే స్టేషన్‌మీదుగా వెంకటాద్రి, రాయలసీమ, కొల్హాపూర్, హుబ్లీ-తిరుపతి, అరకోణం ఎక్స్‌ప్రెస్, బైవీక్లీ ట్రై న్స్ వెళుతుంటాయి. రాజంపేట కేంద్రం నుంచి ప్రజలు హైదరాబాద్, చెన్నై, తిరుపతి, ముంబైకి రాకపోకలు కొనసాగిస్తుంటారు.

ఆగని దేశరాజధాని రైలు...

పార్లమెంటు నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట రైల్వేస్టేషన్ మీదుగా దేశరాజధానికి రైలు నడుస్తోంది. అయితే ఈ రైలుకు స్టాపింగ్‌కు రైల్వేయాజమాన్యం అనుమతి ఇవ్వని పరిస్థితి. కొన్నేళ్లుగా ఈ రైలు స్టాపింగ్‌కు వినతులు, విజ్ఞప్తులు అధికారులకు చేరుతున్నాయి. అయినా వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. ఇటీవల రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి స్వయంగా కేంద్రరైల్వేశాఖ మంత్రిత్వశాఖను రాజధానికి వెళ్లే రైలుకు స్టాపింగ్ ఇవ్వాలని కోరిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు. తిరుపతి నుంచి దేశరాజధానికి నడిచే ఏపీ సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు స్టాపింగ్ ఇస్తూ, డైలీ నడిపించడం వల్లే రాజంపేటతో జిల్లాలోని పలు రైల్వేస్టేషన్లకు ఉపయోగకరంగా ఉంటుందని మేధావి వర్గాలు అంటున్నాయి. స్టాపింగ్ ఇవ్వలేనప్పుడు, డైలీ రన్ అనేది ప్రశ్నార్థకరమేనని రైల్వే వర్గాలు చెబుతున్నాయి.

ఆర్వోబీ నుంచి స్టేషన్‌కు పాత్ ఏదీ?

రాజంపేట రైల్వేస్టేషన్‌కు వివిధ ప్రాంతాల నుంచి ప్రయాణికులు వస్తుంటారు. ఇక్కడ సరైన మార్గం లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్వోబీకి పాత్‌తోపాటు స్టెప్స్ ఏర్పాటుచేస్తే స్టేషన్‌కు బస్సుల్లో వచ్చే వారికి సౌకర్యంగా ఉంటుంది. లేదంటే ఆర్వోబీ ఎండ్ నుంచి ఆటోల ద్వారా స్టేషన్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. రెండో ప్లాట్‌ఫాం పూర్తిగా కవరింగ్‌లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు.

కలగా మిగిలిన ప్రత్యేక రిజర్వేషన్ కౌంటర్

రాజంపేట రైల్వేస్టేషన్‌లో ప్రత్యేకరిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. బుకింగ్ ఆఫీసులు పనిచేసే కమర్షియల్ ఉద్యోగులు అరకొరగా ఉండటంతో ఒకేసారి రిజర్వేషన్, రన్నింగ్‌ట్రైన్స్ టికెట్స్ జారీ కష్టతరంగా మారుతోంది. తత్కాల్ సమయంలో పరిస్థితి ఇబ్బందికరంగా మారుతోంది. రెండు కౌంటర్లు ఉన్నప్పటికీ ఒకే సిస్టమ్ మీద రిజర్వేషన్, జనరల్‌టికెట్స్ ఇవ్వడమంటే కష్టతరమనే భావన నెలకొంది.ఈ విషయంపై అనేకమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లినా ఫలితం మాత్రం శూన్యం.

హాల్టింగ్ ట్రైన్స్

రాయలసీమ, వెంకట్రాద్రి, ఎగ్మోర్,సూపర్ ఎక్స్‌ప్రెస్, మెయిల్ , ఇంటర్‌సిటీ, అరకోణం, గుంటూరు ప్యాసింజరు



హాల్టింగ్ లేనివి ..

ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్(న్యూఢిల్లీ-తిరుపతి), హరిప్రియ (కోల్హాపూర్-తిరుపతి), జయంతి (ముంబై-కన్యాకుమారి), మధురై-కాచిగూడ, ముంబై-నాగర్‌కోయిల్(బాలాజీ).

అన్ని రైళ్లు ఆగితే మేలు



రాజంపేట రైల్వేస్టేషన్‌లో అన్ని రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉందని ఎంపీ మిథున్‌రెడ్డికి విన్నవించాం. ఇప్పటికే ఎంపీ ఢిల్లీలో అనేకమార్లు రైళ్ల హాల్టింగ్ విషయంపై రైల్వేమంత్రిని కలిసి కోరారు. రాజంపేటపై ఎంపీ ప్రత్యేక దృష్టి సారించారు. అన్ని రైళ్లు ఆగితే ప్రజలకు మేలు.ఎగుమతులు,దిగుమతులు, ప్రజారవాణాకు దోహదపడుతుంది.

-మర్రిరవికుమార్, వైస్‌చైర్మన్, పురపాలకసంఘం, రాజంపేట

కడపతో సమానంగా అభివృద్ధి చేయాలి



రాజంపేట రైల్వేస్టేషన్‌ను కడపస్టేషన్‌తో సమానంగా అభివృద్ధి చేయాలి. పేరుకే పార్లమెంటు నియోజకవర్గ కేంద్రంకానీ, ఆ స్థాయిలో రైల్వేస్టేషన్ ఉండేలా యాజమాన్యం దృష్టి సారించలేదు. దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులను దృష్టిలో ఉంచుకొని ఆ ప్రాంతరైళ్లకు స్టాపింగ్ కల్పించాలి. ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడామల్లికార్జునరెడ్డిలు రైళ్ల హాల్టింగ్ సమస్యపై దృష్టి సారించారు.

-దాసరి చిదానందగౌడ్, స్టేట్‌డైరక్టరు, ఈడిగ డెవలప్‌మెంట్ కార్పొరేషన్

లక్ష్య సాధనకు విద్యార్థులు ఇష్టపడి చదవాలి

జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు ఆఫీసర్ ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు ఆఫీసర్ ప్రభాకర్‌రెడ్డి

సిద్దవటం: విద్యార్థులు లక్ష్య సాధన కోసం ఇష్టపడి చదివితే మంచి ప్రయోజకులు అవుతారని వైఎస్సార్ జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు ఆఫీసర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సిద్దవటంలోని శ్రీ నలంద హైస్కూల్‌లో శనివారం జనవిజ్ఞాన వేదిక, నలంద పాఠశాల వారు సంయుక్తంగా విద్యా, వైజ్ఞానిక వినోదాల సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సిద్దవటం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసకల్యాణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి భావిభారత పౌరులని , అబ్దుల్ కలాం ఆశయ సాధనతో విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. అనంతరం ప్రాజెక్టు ఆఫీసర్ అంబవరపు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వారి జీవితాల్లో ఎన్ని అవరోధాలు ఎదురైనా ఏకాగ్రత, పట్టుదలతో చదివితే ఉన్నత స్థానాలను చేరుకోవచ్చన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని, తల్లిదండ్రుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని చదివితే సమాజంలో మంచి ప్రయోజకులు అవుతారని పేర్కొన్నారు. అనంతరం మెజీషియన్‌లు అమర్‌నాథ్, సుజన్‌కుమార్, మైనా, బాలబయ్యన్నలు చేసిన మ్యాజిక్‌షోలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శంకరయ్య, ప్రొఫెసర్ వెంకట్రామిరెడ్డి, పి.వి. కృష్ణారెడ్డి, జనవిజ్ఞాన వేదిక జిల్లా సమతా అధ్యక్షురాలు పద్మావతి, జనవిజ్ఞాన వేదిక నాయకులు సుధీర్‌కుమార్, వెంకటేశ్వర్లు, నీరోళ్ల రామ్మోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ నూతన వీసీ బాధ్యతల స్వీకరణ



వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ తొలి వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆచార్య బానోతు ఆంజనేయ ప్రసాద్

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం తొలి వైస్ చాన్సలర్‌గా ఆచార్య బానోతు ఆంజనేయ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. శనివారం ఉదయం విశ్వవిద్యాలయానికి విచ్చేసిన ఆయనకు రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి పూలబొకే అందజేసి స్వాగతం పలికారు. అనంతరం వీసీ పూజా కార్యక్రమాలు నిర్వహించి, బాధ్యతలు స్వీకరించారు. విశ్వవిద్యాలయ అధ్యాపకులు, సిబ్బంది వీసీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విశ్వవిద్యాలయ ప్రగతికి కృషిచేస్తా..

ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తనపై నమ్మకంతో వైస్ చాన్సలర్ బాధ్యతలు అప్పజెప్పిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. విశ్వవిద్యాలయం ప్రగతికి కృషిచేస్తానని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందిస్తామన్నారు. విశ్వవిద్యాలయానికి కేటాయించిన భూమి, నిధులు, అనుమతులపై ప్రత్యేక దృష్టిసారిస్తామని తెలిపారు. అనంతరం విశ్వవిద్యాలయ అధ్యాపకులతో సమావేశం నిర్వహించి, వారిని పరిచయం చేసుకుని బోధనపై మార్గనిర్దేశం చేశారు. అనంతరం విశ్వవిద్యాలయ భవన నిర్మాణాల ఆకృతులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ విశ్వవిద్యాలయంకు సంబంధించిన ప్రగతి, కోర్సుల వివరాలు, అధ్యాపకులు, సిబ్బందికి సంబంధించిన సమాచారం అందించారు. అనంతరం వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, కడప డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్ దంపతులు, జేఎన్‌టీయూ అధ్యాపకులు, సిబ్బంది వీసీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ యెద్దుల పవన్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కడప విమానాశ్రయ అభివృద్ధి పనులు పూర్తి



కడప ఎయిర్‌పోర్టులో పూర్తయిన రన్‌వే

కడప కోటిరెడ్డిసర్కిల్(వైఎస్సార్‌జిల్లా) : కడప నగర శివార్లలోని విమానాశ్రయంలో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ఇటీవల కొత్తగా చేపట్టిన కడప విమానాశ్రయం రన్‌వే విస్తరణ, ట్యాక్సీ వే, నాలుగు కొత్త ఆప్రాన్లు (విమానాల పార్కింగ్) పనులు పూర్తయ్యాయి.దీంతో ఇక్కడ నైట్ ల్యాండింగ్ అందుబాటులోకి వచ్చింది. విమానాశ్రయం విస్తరణకు అవసరమైన 70 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత వేగంగా సేకరించి కేంద్ర ప్రభుత్వానికి అప్పజెప్పడంతో అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తయ్యాయి. ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు ఒనగూరనున్నాయి.

డీ అంటే డీడీ

- పశుసంవర్ధకశాఖలో ముదిరిన రచ్చ
- అధికారం లేకపోయినా సరెండర్ ఉత్తర్వులు జారీ చేసిన డీడీ
- కలెక్టర్ నుంచి రాష్ట్రపతి వరకూ ఫిర్యాదు చేసిన యంత్రాంగం
- పెన్‌డౌన్ సమ్మెకు దిగిన పశుసంవర్ధకశాఖ అధికారులు



వైఎస్సార్ జిల్లా పశు సంవర్ధకశాఖ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, కడప: ఉన్నతాధికారి మార్గనిర్దేశకుడై ఉండాలి. సంస్థ ప్రతిష్ట పెంచేదిశగా చర్యలుండాలి. అప్పుడే లక్ష్యసాధనలో విజయం లభిస్తుంది. పశుసంవర్ధకశాఖలో తద్భిన్నమైన పరిస్థితులు తెరపైకి వచ్చాయి. డీడీ, ఉద్యోగుల మధ్య ఏర్పడిన రచ్చ ముదురుతోంది. జిల్లా పరిపాలన విభాగానికే సవాల్ విసురుతున్న నేపథ్యమిది.

ప్రభుత్వ ఉద్యోగులు ప్రవర్తనా నియామవళికి అనుగుణంగా విధులు నిర్వర్తించాల్సి ఉంది. ఎవరి విధులు వారు సవర్థవంతంగా, బాధ్యతాయుతంగా నిర్వహిస్తే ఆయాశాఖలకు తద్వారా ప్రభుత్వానికి ప్రజల్లో మంచిపేరు లభిస్తోంది. గ్రామీణ ప్రజలతో నేరుగా సత్సంబంధాలున్న పశుసంవర్ధకశాఖ యంత్రాంగం ఆ విషయాన్ని పూర్తిగా మర్చిపోయి ప్రవర్తిస్తోంది. ఉన్నతాధికారి ఒంటెత్తు పోకడల కారణంగా బజారున పడాల్సి వస్తోంది. పెన్‌డౌన్ వరకూ దారి తీసిన వ్యవహారం మరింత ముదిరిపోయి, సమ్మెదిశగా వెళ్లకముందే చర్యలు చేపట్టాల్సిన బాధ్యత అటు జిల్లా సర్వోన్నతాధికారి, ఇటు పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌లపై లేకపోలేదు.

ఆదరించాల్సిన అధికారే ...

ఉద్యోగులు వారి బాధ్యతలు నిర్వర్తించడంలో అలసత్వం వహిస్తే ఉన్నతాధికారి చర్యలు చేపట్టాల్సిందే. కాకపోతే నన్ను పట్టించుకోలేదు, స్థాయికి తగ్గ గౌరవం ఇవ్వలేదు.. ఇలాంటి కారణాలు బూచిగా చూపిస్తూ సరెండర్ ఉత్తర్వులు జారీ చేయడంపై పశువైద్యాధికారుల సేవాసంఘం, పశుసంవర్ధకశాఖ అధికారుల సంఘం అభ్యంతరం చెబుతోంది. విధి నిర్వహణలో లోపం ఉంటే చర్యలు తీసుకోవాలి.. సకాలంలో జీతాలు బిల్లులు డ్రాయింగ్ ఆఫీసర్‌గా ఎందుకు పెట్టరని ప్రశ్నిస్తే వేధిస్తారా అని పశువైద్యాధికారుల సంఘం నిలదీస్తోంది. పైగా సరెండర్ చేసే అధికారం కూడా డీడీ డాక్టర్ అచ్చెన్నకు లేదని వివరిస్తున్నారు. ఆదరించాల్సిన అధికారే వేధిస్తున్నారని ఉద్యోగులు వాపోతుండడం గమనార్హం.

కలెక్టర్ నుంచి రాష్ట్రపతి వరకూ ఫిర్యాదు

కడప పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ సి అచ్చెన్న శైలిపై కలెక్టర్ నుంచి రాష్ట్రపతి వరకూ పశుసంవర్ధకశాఖ యంత్రాంగం వివిధ రూపాలల్లో ఫిర్యా దు చేసింది. ప్రాథమికంగా విచారించిన కలెక్టర్ విజయరామ రాజు రాష్ట్ర ప్రభుత్వానికి సరెండర్ చేశారు. కలెక్టర్ ఉత్తర్వులపై డీడీ డాక్టర్ అచ్చెన్న హైకోర్టును ఆశ్రయించి స్టేటస్‌కో ఉత్తర్వులు తీసుకొచ్చారు. ఆ తర్వాత మరింత ఇష్టారాజ్యంగా వ్యవహరించడం ఆరంభించారని ఉద్యో గు లు ఆరోపిస్తున్నారు. అదేమంటే పోలీసులకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మేరకు ఫిర్యాదు చేయడం ఆరంభించారు. తుదకు ఓ దశలో సర్వోన్నతాధికారి కుటుంబ సభ్యుడిపై కూడా అట్రాసిటీ చట్టం ప్రయోగించినట్లు సమాచారం.

చర్యలు తీసుకోకపోతే ధర్నా

ప్రభుత్వానికి సరెండర్ చేసిన ఇద్దరు ఏడీలు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, ఇద్దరు అటెండర్లపై చర్యలు తీసుకోవాలి. తాను ఆదేశించినా జేడీ డాక్టర్ శారదమ్మ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అలా తీసుకోకపోతే ఈనెల 27న కలెక్టరేట్ ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా చేస్తానని డాక్టర్ అచ్చెన్న మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో అల్టిమేటమ్ జారీ చేశారు. -డాక్టర్ అచ్చెన్న

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

పశుసంవర్ధకశాఖ ఉద్యోగుల మధ్య నెల కొన్న వివాదం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికే పశువైద్యాధికారులు పెన్‌డౌన్ సమ్మె పాటిస్తున్నారు. పరిస్థితి మరింత జఠిలం కాకముందే చక్కబెట్టాలని కోరాం. అసిస్టెంట్ డైరెక్టర్లను ప్రభుత్వానికి సరెండర్ చేసే అధికారం డీడీకి లేదు. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు విన్నవించాం. -జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శారదమ్మ

విచారణకు త్రిసభ్య కమిటీ: రాష్ట్ర డైరెక్టర్

జిల్లాలో పశుసంవర్ధకశాఖ ఉద్యోగుల మధ్య నెల కొన్న వివాదంపై ఆశాఖ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ అమరేంద్రకుమార్ దృష్టికి సాక్షి ప్రతినిధి తీసుకెళ్లగా విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. అదనపు సంచాలకులు డాక్టర్ సింహాచలం, జాయింట్ డైరెక్టర్లు డాక్టర్ రజనీకుమారి, డాక్టర్ సత్యకుమారిని నియమించినట్లు తెలిపారు. మంగళవారం త్రిసభ్య కమిటీ కడపలో పర్యటించి పూర్తి స్థాయి విచారణ అనంతరం ప్రభుత్వానికి నివేదించనున్నట్లు వివరించారు.

రాజీ మార్గం.. సత్వర న్యాయం

- లోక్‌అదాలత్‌లో 1,015 కేసుల పరిష్కారం
- రూ.4,05,80,996లకు కక్షిదారులు రాజీ


కేసులను పరిష్కరిస్తున్న జడ్జి పి.భాస్కరరావు

మదనపల్లె : రాజీ మార్గంలో సత్వర న్యాయం లభిస్తుందని సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి పి.భాస్కరరావు పేర్కొన్నారు. మదనపల్లె న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో శనివారం జాతీయలోక్ అదాలత్‌లో భాగంగా నాలుగు బెంచీలు ఏర్పాటు చేశారు. మదనపల్లెలోని వివిధ కోర్టుల్లో పెండింగ్ కేసులను ఇరు వర్గాల రాజీ మార్గం ద్వారా పరిష్కరించారు. మోటార్ ఆక్సిడెంట్ కేసులు, ఎంసీ, డీవీసీ, క్రిమినల్, పరిహారం కేసులు కలిపి 1,015 కేసులను పరిష్కరించారు. రెండో ఏడీజే కోర్టులో ఒక కేసులో రూ.1,71,00,000కు రాజీ కుదిర్చారు. మోటార్ ఆక్సిడెంట్ కేసుల్లో తొమ్మిదింటికి రూ.63,70,000, సివిల్ కేసుల్లో 29కు రూ.2,57,88,706, పరిహారం కేసులు 977కు సంబంధించి రూ.84,22,290 మొత్తం కలిపి రూ.4 కోట్ల 5 లక్షల 80 వేల 996 రూపాయలకు కక్షిదారులకు రాజీ కుదర్చడం జరిగింది. ఇందులో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జిలు డి.వెంకటేశ్వర్లునాయక్, జి.శ్రీనివాసులురెడ్డి, రెండో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్‌కుమార్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.వి.రమణ, సెక్రటరీ జి.శంకరనారాయణ, న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్ట్

- వాహనాల టైర్లు, కాపర్ వైండింగ్ వైర్లే అతని లక్ష్యం
- రూ.15 లక్షల విలువ చేసే వస్తువుల రికవరీ
- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు వెల్లడి

రాయచోటి : వాహనాల టైర్లు, కాపర్ వైండింగ్ బాక్సులను దొంగలించడమే లక్ష్యంగా చేసుకున్న అంతర్‌రాష్ట్ర దొంగను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.15 లక్షల విలువైన వస్తువులను రికవరీ చేశారు. రాయచోటిలోని ఎస్పీ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు శనివారం మొలకలచెరువు సీఐ సాదిక్‌ఆలీతో కలిసి వివరాలు వెల్లడించారు. కడప నగరం అంగడివీధికి చెందిన వెంకటరమణ కుమారుడు గుజ్జల ధనకుమార్(36) ప్రస్తుతం తాడిపత్రి పట్టణం ఎల్లనూరు రోడ్డు బిందిలోల్లకాలనీలో నివాసం ఉంటున్నాడు. కర్ణాటక, ఏపీ రాష్ట్రాలలోని పలు జిల్లాల్లో చోరీలకు పాల్పడ్డాడు. ముఖ్యంగా బళ్లారి, శ్రీ సత్యసాయి, అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పలు రకాల చోరీలు చేశాడు. గతేడాది నవంబర్ 3న మొలకలచెరువు టౌన్


నిందితుడు, స్వాధీనం చేసుకున్న సామగ్రితో పోలీస్ అధికారులు

రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న కదిరి–మదనపల్లి హైవే ఎన్‌హెచ్–42పై గల స్టార్ ఎలక్ట్రికల్ షోరూం షట్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు బ్రేక్ చేసి రూ.2,25,000 విలువ చేసే 25 కాపర్ వైండింగ్ బాక్సులను చోరీ చేశారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మొలకలచెరువు సీఐ సాదిక్‌ఆలీ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. 3 నెలలుగా కష్టపడి ఇలాంటి నేరాలు గతంలో ఎక్కడెక్కడ జరిగాయో తెలుసుకుని పాత నేరస్తుడు ధనకుమార్‌పై నిఘా పెట్టారు. గురువారం రాత్రి మరో నేరం చేయడానికి మదనపల్లెకి వస్తుండగా పోలీసులు పట్టున్నారు. తాడిపత్రిలోని అతడి స్థావరంపై దాడి చేసి వివిధ జిల్లాలలో దొంగలించిన టైర్లు, వైండింగ్ వైర్లతోపాటు ఒక బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరో రెండు కేసులకు సంబంధించిన సామగ్రి సేకరించాల్సి ఉందని ఎస్పీ చెప్పారు. సీఐ సాదిక్‌ఆలీతోపాటు బృందం సభ్యులకు జిల్లా ఎస్పీ క్యాష్ రివార్డుతో అభినందించారు.

బెంగళూరు నుంచి బైక్‌పై వస్తుండగా..

- ఢీకొన్న కారు
- యువకుడి దుర్మరణం
- పెళ్లి చూపుల కోసం ఇంటికి వస్తూ.. కడసారి చూపు పాలైన వైనం


మృతి చెందిన గణేష్

మదనపల్లె : ఓ యువకుడు బెంగళూరు నుంచి బైక్‌పై వస్తుండగా.. కారు ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. బాగా చదువుకుని బ్యాంకు ఉద్యోగం చేస్తూ.. తల్లిదండ్రులకు ఆసరాగా ఉండి.. పెళ్లి చూపుల కోసం స్వగ్రామానికి వస్తూ కడసారి చూపు పాలైన సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. కలికిరి మండలం గుట్టపాళెం పంచాయతీ జి.భరణేపల్లికి చెందిన వాడ సుబ్బయ్య కుమారుడు వి.గణేష్(29) డిగ్రీ పూర్తి చేసి బెంగళూరులోని కె.ఆర్.పురం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. ఆయనకు కుటుంబ సభ్యులు ఇటీవల పెళ్లి ప్రయత్నాలు మొదలు పెట్టారు. అందులో భాగంగా శనివారం పెళ్లి చూపులకు హాజరయ్యేందుకు గణేష్ బెంగళూరు నుంచి బైక్‌పై తెల్లవారుజామున బయలుదేరాడు. మదనపల్లె సమీపంలోని చీకలబైలు వద్దకు రాగానే.. ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గణేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. ఆయనను 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. సమాచారం అందుకున్న బాధిత కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. ఇంటి పెద్ద కొడుకు మృతి చెందడంతో తీవ్ర విషాదంలో మునిగిపోయారు. చివరిసారిగా చూసేందుకు పెద్ద సంఖ్యలో కుటుంబీకులు, బంధువులు వచ్చారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదు రోజుల్లో పెళ్లి..

- ఇంతలోనే వరుడి ఆత్మహత్య
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


వెంకటసుబ్బయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్‌ఐ సుబ్బరాయుడు

నందలూరు(రాజంపేట) : ఐదు రోజుల్లో పెళ్లి ఉండగా.. ఏమి జరిగిందో, ఏమో కానీ వరుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నందలూరు మండలం నల్లతిమ్మాయపల్లెలో శనివారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ సుబ్బరాయుడు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటసుబ్బయ్య (24) ఆటో డ్రైవరుగా జీవనం సాగించే వాడు. బద్వేలుకు చెందిన అమ్మాయితో ఇటీవల పెళ్లి కుదిరింది. ఈ నెల 16న వివాహం జరగాల్సి ఉంది. ఈ లోపే గ్రామ శివారులోని తమ ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన మృతికి ఎవరూ కారణం కాదని, ఇంటి గోడపై రాసినట్లు ఉంది. వెంకటసబ్బయ్య చేతులు వెనక కట్టిబడి వుండటంతో మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లుగా పోలీసులు కేసు నమోదు చేశారు.


సుశీలమ్మ మృతదేహం వద్ద భర్త, స్థానికులు

ద్విచక్రవాహనంపై నుంచి కింద పడి..

మహిళ మృతి

తంబళ్లపల్లె : ద్విచక్ర వాహనంపై భర్తతో పాటు వెళ్తుండగా పట్టు తప్పి కింద పడిన ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన శనివారం మండలంలోని చెట్లవారిపల్లె సమీపంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబీకుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పరషతోపు పంచాయతీ చెన్నప్పగారిపల్లెకు చెందిన చంద్రమోహన్ చేతిమగ్గం నేస్తూ, భార్య సుశీలమ్మ (44) కూలీ పనులకు వెళుతూ ముగ్గురు పిల్లలను పోషించుకుంటున్నారు. శనివారం తోటి కూలీలు చౌడసముద్రం వద్ద పొలానికి ఆటోలో వెళ్లారు. ఆలస్యం కావడంతో భర్త చంద్రమోహన్ ద్విచక్రవాహనంలో సుశీలమ్మను వ్యవసాయ పొలం వద్దకు తీసుకెళుతుండగా చెట్లవారిపల్లె సమీపంలో పట్టుతప్పి ఆమె కింద పడింది. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రామకృష్ణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ఆస్పత్రికి తరలించారు.

గాయపడ్డ వ్యక్తి మృతి

కలకడ : మండలంలోని కె.బాటవారిపల్లెలో ఈ నెల 4న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ సిటి స్వామి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై పూజారి రామయ్య, రెడ్డెప్ప టీవీఎస్ ఎక్సెల్‌లో వెళ్తుండగా, కలకడ గ్రామానికి చెందిన మహమ్మద్ ఖాసీం వెనక నుంచి బైక్‌పై ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో పోతువారిపల్లెకు చెందిన కంబళ్ళ రెడ్డెప్ప గాయపడగా తిరుపతి ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు బాలక్రిష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యల కారణంగా వివాహిత ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన శుక్రవారం రాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది. మల్లికార్జున సర్కిల్ సమీపంలో నివసిస్తున్న ఠాగూర్ భార్య అనూష (29) కుటుంబ సమస్యల కారణంగా నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె ఆస్పత్రిలో కోలుకుంటోంది.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. మదనపల్లె లోని నీరుగట్టువారిపల్లెకు చెందిన విశ్వనాథ(32), ఆర్.ఈశ్వర(28) ద్విచక్రవాహనంలో శుక్రవారం రాత్రి పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్దకు వస్తుండగా ప్రశాంత్‌నగర్ బోర్డు వద్ద ముందు వెళుతున్న లారీ సడన్‌గా బ్రేక్ వేయడంతో, ద్విచక్రవాహనం అదుపుచేయలేక లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని గమనించిన స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. అదే విధంగా కలికిరి మండలం బోడేవాండ్లపల్లెకు చెందిన సురేంద్ర (42), నాగరాజ(27) వ్యక్తిగత పనులపై శుక్రవారం రాత్రి మదనపల్లెకు వచ్చారు. తిరిగి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వెళుతుండగా పట్టణ శివారులోని బైపాస్‌రోడ్డులో వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో వారు ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మదనపల్లె తాలూకా పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి బలవన్మరణం

చింతకొమ్మదిన్నె : మండలంలోని హోంగార్డు కాలనీకి చెందిన షేక్ రెహమాన్ (30) అనే యువకుడు శనివారం బలవన్మరణం చెందాడు. ఇన్‌చార్జి ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రెహమాన్ కడప నగరంలోని టైల్స్ దుకాణంలో పని చేస్తూ జీవనం సాగించే వాడు. రెండు నెలల క్రితం హోంగార్డు కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకొని భార్య, కుమారిడితో కలిసి నివాసం ఉండే వాడు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన కారణాలు వెలికి తీసేందుకు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

‘నాగాభరణ’ పుస్తకావిష్కరణ


నాగాభరణ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి స్వగృహంలో శనివారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురావస్తు, ప్రదర్శనల శాఖ మాజీ సంచాలకులు హైదరాబాద్‌కు చెందిన ఆచార్య పెద్దారపు చెన్నారెడ్డి రచించిన ‘నాగాభరణ’ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రచయిత పెద్దారపు చెన్నారెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఈ పుస్తకంలో భారతదేశంలో జైన మతం వ్యాప్తి, ఇటీవలి ధోరణులపై చక్కగా వివరించారన్నారు. ఆయన 42 పుస్తకాలు, అనేక వ్యాసాలు, భారతదేశ సంస్కృతిపై పుస్తకాలు రాశారన్నారు. ఈ పుస్తకాన్ని ప్రముఖ జైన సిద్ధ ఆచార్య హంపా నాగరాజయ్యకు అంకితమివ్వడం శుభపరిణామమన్నారు. ఆచార్య పెద్దారపు చెన్నారెడ్డి దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికి ప్రధాన అనుచరుడిగా ఉండే వారన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

- ప్రమాదం జరిగిందంటున్న యజమాని
- అనుమానం ఉందని మృతుడి భార్య ఫిర్యాదు


శ్రీరాములు మృతదేహం

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని మడకలవారిపల్లె సమీపంలో శనివారం ఓ ట్రాక్టర్ డ్రైవర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మడకలవారిపల్లె గ్రామానికి చెందిన శీర్ల శ్రీరాములు (31) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తుండే వాడు. శనివారం ఉదయం గ్రామానికి సమీపంలోని కొండ ప్రాంతం నుంచి గ్రావెల్ తీసుకు రావాలని శ్రీరాములును ట్రాక్టర్ యజమాని తీసుకువెళ్లాడు. కొద్దిసేపటికి శ్రీరాములు భార్య సుజాతకు ట్రాక్టర్ యజమాని ఫోన్ చేసి ‘నీ భర్తకు యాక్సిడెంట్ జరిగి తీవ్ర గాయాలయ్యాయి, ఆసుపత్రికి తీసుకెళుతున్నాం, మీరు రండి’ అని సమాచారమిచ్చాడు. వెంటనే ఆమె హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి వెళ్లగా అప్పటికే శ్రీరాములు మృతి చెంది ఉన్నాడు. మట్టి తోలుకుని తిరిగి వస్తున్న సమయంలో కొండ ప్రాంతంలో ట్రాక్టర్ అదుపు తప్పడంతో ప్రాణ భయంతో శ్రీరాములు కిందికి దూకాడని, ఈ సమయంలో ఆయనపైకి ట్రాక్టర్ వెళ్లిందని ట్రాక్టర్ యజమాని సుజాతకు వివరించారు. అయితే సుజాత తన భర్త మృతిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రూరల్ ఎస్‌ఐ చంద్రశేఖర్ అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం వెలికితీత

సింహాద్రిపురం : సింహాద్రిపురం – ముసల్‌రెడ్డిపల్లె ప్రధాన రోడ్డులోని పొలం పక్కన ఉన్న సంప్‌లో శుక్రవారం గల్లంతైన వ్యక్తి మృతదేహాన్ని శనివారం వెలికితీశారు. ఎస్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పులివెందుల మండలం కె.కె.కొట్టాల గ్రామానికి చెందిన జయలక్ష్మీదేవి సింహాద్రిపురం మండలం తెలికి గ్రామంలో బంధువుల పెళ్లికి వెళ్లేందుకు పులివెందులలో ఆటోను బాడుగకు తీసుకుని.. పూలంగళ్ల సర్కిల్‌లో ఉన్న భర్త రామాంజనేయ నాయుడు(27)ను ఎక్కించుకుని బయలుదేరారు. పెళ్లికి వెళ్తున్నాము కదా.. ముఖం కడుక్కుందామని రామాంజనేయ నాయుడు భావించి మార్గంమధ్యలో సంప్ వద్ద ఆగాడు. ఆయన ముఖం కడుక్కొంటుండగా ప్రమాదవశాత్తు సంప్‌లో పడ్డాడు. భార్య సంప్ వద్దకు వెళ్లి చూస్తే.. భర్త కనిపించలేదు. దీంతో ఆమె పోలీసులకు తెలిపింది. వారు వెంటనే అక్కడికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం రాత్రి కావడంతో అంతరాయం ఏర్పడింది. శనివారం ఉదయం పోలీసులు పులివెందుల అగ్నిమాపక సిబ్బంది, మైలవరం నుంచి గజ ఈతగాళ్లను రప్పించి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి భార్య, కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా లూర్దుమాత తిరునాల

ముగిసిన నవదిన ఉత్సవాలు

కడప కల్చరల్ : కరుణామయి, ప్రేమమూర్తి ఏసు క్రీస్తును ఈ లోకానికి అందించిన దయగల తల్లి లూర్దుమాత తిరునాల శనివారం వైభవంగా నిర్వహించారు. కడప నగరం మరియాపురం పాత చర్చి ఆవరణలో పది రోజులుగా జరుగుతున్న తిరునాల శనివారం ముగిసింది. ఇందులో భాగంగా ఉదయం మరియాపురంలోని పాత గుడివద్ద బిషప్ గాలి బాలి సమష్టి బలిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లూర్దుమాత ఆశీస్సులతోనే నవదిన ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించగలిగామని, ఆమెతోపాటు ప్రభువైన ఏసుక్రీస్తుకు కృతజ్ఞతలు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన లూర్దుమాత దర్శనమిచ్చిన సంఘటనలను వివరించి వాక్యపరిచర్య చేశారు. జర్మనీ నుంచి వచ్చిన క్రైస్తవ ప్రతినిధులు కూడా ప్రార్థనల్లో పాల్గొన్నారు. మరియమాత ఆశీస్సులు అందరికీ మెండుగా లభించాలని బిషప్ ప్రార్థించారు. సెయింట్ మేరీస్ కేథడ్రల్ గాయక బృందం స్తుతి గీతాలను ఆలపించారు. ప్రార్థనల్లో మరియాపురం విచారణ గురువులు ఇతర ఫాదర్లు, ఆరోగ్యమాత చర్చి ప్రతినిధులు, ఇంకా పలువురు క్రైస్తవ గురువులు, కన్య స్త్రీలు, విశ్వాసులు పాల్గొన్నారు.


బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న గురువులు

సందడే సందడి

లూర్దుమాత నవదిన ఉత్సవాల ముగింపు సందర్భంగా పాత చర్చి ఆవరణలో తిరునాల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎద్దులతో బండలాగుడు పోటీలను నిర్వహించారు. విజేతలైన ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేశారు. తిరునాల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఆ ఆవరణం సందడిగా మారింది. అడుగడుగునా దుకాణాలు ఏర్పాటు చేయంతో మైదానం జనంతో నిండిపోయింది. ప్రాగంణమంతా రంగుల రాట్నాలు, కొలంబస్, జాయింట్ వీల్, బొమ్మ రాకెట్లు, బొమ్మ ట్రైన్‌లతో పిల్లల కేరింతలతో సందడిగా కనిపించింది. జనంతో దుకాణాల ప్రాంతం నిండిపోయింది. విచారణ గురువులు బిరుసు రాజా, తిరునాల కమిటీ అధ్యక్షులు వారాధి జోసెఫ్, ఉపాధ్యక్షులు పుల్లగుజ్జు విజయ్‌కుమార్, కార్యదర్శి పుల్లగూర లూర్దు, సభ్యులు ఎండీ అల్ఫోన్స్, నందిమండలం విజయరాజు, అల్లూరి జోజప్ప కార్యక్రమాలను పర్యవేక్షించారు.